# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-12-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పోలవరం, మార్కాపురం జిల్లాలు అధికారికంగా ఈరోజు నుంచి అమల్లోకి వచ్చాయి.**

2. **హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించనున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి వెల్లడించారు**

3. **నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో జనవరి నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్‌లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు పంపిణీ చేస్తోంది.**

4. **ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో విద్యుత్ అంతరాయం అంశాన్ని రాజకీయం చేయడం తగదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

5. **క్యాన్సర్ చికిత్సకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ముఖ్య కేంద్రంగా ఎదుగుతోందని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో కొత్త జిల్లాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తూ, అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీటితో పాటు రాష్ట్రంలో కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దులు మార్పు చేస్తూ తుది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ఈరోజు నుంచి కొత్త జిల్లాల ఏర్పాటు అమల్లోకి వచ్చాయి. దీంతో మొత్తంగా రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 26 నుంచి 28కి పెరిగింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో గుర్తు తెలియని వ్యక్తులు శివలింగాన్ని ధ్వంసం చేయడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శివలింగం ధ్వంసం ఘటనపై జిల్లా ఎస్పీ, కలెక్టర్ తో పాటు జిల్లా మంత్రితో మాట్లాడినట్లు ఆనం రామనారాయరెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఘటన కు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, . ఘటనపై దర్యాప్తులో ప్రగతిని తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని ముఖ్యమంత్రి

అధికారులను ఆదేశించారు.

--------------------------

హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగామార్చేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించనున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బాహ్యవలయ రహదారి–ఓఆర్ఆర్ పరిధిలోని 'ప్రధాన పట్టణ ప్రాంత ఆర్థిక వ్యవస్థ'–క్యూర్ ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నగరంలో చెత్త నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, నెలలో మూడు రోజులు పారిశుధ్యం మెరుగుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో విద్యుత్ అంతరాయం అంశాన్ని కొందరు రాజకీయం చేయడం దురదృష్టకరమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్..25 సెకన్లు

--------------------------

అయోధ్య నుండి యునెస్కో వరకు పురాతన సంప్రదాయాలను, ఆధునిక డిజిటల్ యుగంతో మేళవిస్తూ సాగిన భారతదేశ సాంస్కృతిక శక్తిని ఈ ఏడాది ఎలా ఆవిష్కరించిందో ఈ రోజు తెలుసుకుందాం.

2025 సంవత్సరం భారతీయ సంస్కృతికి స్వర్ణయుగంగా నిలిచింది. ఈ ఏడాది ప్రారంభమై, ఫిబ్రవరి 26, 2025న ముగిసిన మహా కుంభమేళాలో 66 కోట్లకు పైగా ప్రజలు పాల్గొన్నారు. నవంబర్ 25న అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి రామమందిరం ఆలయంపై కాషాయ ధర్మధ్వజాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో 'వందేమాతరం' నినాదం పోషించిన పాత్రను స్మరించుకుంటూ ఏడాది పొడవునా సాగే ఉత్సవాలకు కేంద్రం నవంబర్ 2025లో శ్రీకారం చుట్టింది. మరాఠా సైనిక కోటలకు 'ప్రపంచ వారసత్వ హోదా' లభించడంతో పాటు 'దీపావళి'కి యునెస్కో 'మానవత్వపు అమూల్య సాంస్కృతిక వారసత్వ' జాబితాలో చోటు కల్పించింది. ఈ విధంగా భారతీయ మూలాలను స్మరించుకునేలా 2025 భారత సాంస్కృతిక గమనం అద్భుతంగా సాగింది.

--------------------------

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జనవరి నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్‌లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ రోజు పంపిణీ చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 63.12 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు 2 వేల 743 కోట్ల రూపాయాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఉదయం నుంచే అధికారులు ఇంటి వద్దే లబ్ధిదారులకు పింఛన్ల నగదు అందజేస్తున్నారు. కొత్త ఏడాది సందర్భంగా ఒక రోజు ముందుగానే పింఛను పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.

--------------------------

క్యాన్సర్ చికిత్సకు ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం ముఖ్య కేంద్రంగా ఎదుగుతోందని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ తెలిపారు. విశాఖపట్నంలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రిలో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స కోసం ఏర్పాటు చేసిన టోమోథెరపీ రాడిక్సాక్ట్ X 9 యంత్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం శ్రీ భరత్ మాట్లాడుతూ

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై టోల్ రుసుముకు మినహాయింపు ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈమేరకు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి, తెలంగాణా రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ రాశారు. సంక్రాంతి పండుగ రోజుల్లో 200శాతం అధికంగా ట్రాఫిక్ రద్దీ ఉంటుందని ఈ సమయంలో టోల్ రుసుము లేకుండా ఉచిత ప్రయాణానికి అనుమతించాలని లేఖలో పేర్కొన్నారు. పండగ రద్దీ నేపథ్యంలో వచ్చే నెల 9 వ తేది నుంచి 14 వ తేది వరకు హైదరాబాద్-విజయవాడ రహదారిలో, 16 నుంచి 18 వరకు విజయవాడ- హైదరాబాద్ మార్గంలో టోల్ మినహాయించాలని కోరారు.

---------------------------

అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ సిబ్బంది సీపీఆర్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలస్సిన అవసరం ఉందని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్. పి. చంద్రశేఖర్ తెలిపారు. సీపీఆర్ ప్రక్రియపై ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ లోక్‌భవన్ సిబ్బందికి నిన్న శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాణాధార శిక్షణను కేవలం వైద్య సిబ్బందికే పరిమితం చేయకుండా, సమాజంలోని ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సీపీఆర్ పరిజ్ఞానం కలిగిన సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశ్యమని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో చలి తీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దట్టమైన పొగమంచు కారణంగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. రానున్న రోజులు రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

=====================